సాక్షి
అనంతపురం

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



మానవాళికి మార్గదర్శకం

మహమ్మద్(స) పుట్టిన రోజును నేడు మిలాద్ ఉన్ నబీగా ముస్లింలు ఆచరిస్తారు. ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి.

8లో



టమాట కిలో రూ.33

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.33 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.25 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.



జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసు

వైఎస్ జగన్‌కు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే మెడికల్ కళాశాలలను రద్దు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రానికి తొలిసారిగా ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు రావడం ఎంతో గొప్ప విషయం. వైద్య కళాశాలలు లేక వేరే ప్రాంతాలకు మన పిల్లలు వెళ్తున్నారు. ఫిలిప్పీన్స్, రష్యా, ఉక్రెయిన్, అమెరికా వంటి దేశాల్లో మనవాళ్లు ఎంత మంది చదువుతున్నారో గుర్తించాలి. వైద్య విద్య నిమిత్తం ఫిలిప్పీన్స్ వెళ్లిన ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం ఈ ప్రభుత్వానికి అర్థం కావడం లేదు.ఎంతసేపూ వైఎస్సార్‌సీపీపై పడి ఏడిస్తే ఏం లాభం?!

– డాక్టర్ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, కళ్యాణదుర్గం



పేదలకు వైద్య విద్య దూరం చేస్తున్నారు

రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక విద్యా వ్యవస్థను ప్రయివేట్‌పరం చేయాలని చూస్తున్నారు. కార్పొరేట్ చేతుల్లోకి అప్పగించి విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేస్తే పేద విద్యార్థులు నష్టపోతారు. వైద్య విద్య అభ్యసించేందుకు రూ. లక్షలు, రూ. కోట్లు ఫీజులు కట్టాల్సి వస్తోంది. ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు వైద్య విద్య చదవడం కలగానే మిగిలిపోతుంది.

– శివశంకర్ నాయక్, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు



న్యూస్‌రీల్

‘అనంత’లో ఏసీఏ క్రికెట్ అకాడమీ!



అనంతపురం: దులీప్ ట్రోఫీకి వేదికైన అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. వైఎస్సార్ జిల్లా కడపలో ఉన్న ఏసీఏ క్రికెట్ అకాడమీని అనంతపురానికి మార్చనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెసిడెన్షియల్ తరహాలోని ఈ క్రికెట్ అకాడమీలో ఆటపై శిక్షణ ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తారు. మంచి పాఠశాలలో ఉచితంగా చదివిస్తారు. ఉదయం, సాయంత్రం క్రికెట్‌పై శిక్షణ ఇస్తారు. ఇప్పటికే అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్ అకాడమీ నిర్వహిస్తున్నారు. టెన్నిస్ అకాడమీకి రఫా నాదల్ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేస్తోంది.

లాభాలెన్నో...

క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేస్తే కొత్తగా ఉద్యోగులతో పాటు మరికొంత మంది క్రికెట్ కోచ్‌లు నియమితులవుతారు. ప్రతిభ ఉన్న పేద, మధ్య తరగతి వారు ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందుకోవడానికి వీలు కలుగుతుంది. క్రికెట్ అకాడమీని ఆర్డీటీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు, విధివిధానాలు త్వరలో ఖరారు కానున్నాయి.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనంతపురం అర్బన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ సెలవు దినం అని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉండదని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

అనంతపురం: మిలాద్– ఉన్–నబీ పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ప్రజలు ఈ నెల 23న జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య



మృతుడు దండు శంకరయ్య

కూడేరు: భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గొటుకూరులో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన దండు శంకరయ్య (45) భార్య దండు ఈశ్వరమ్మ అనారోగ్యంతో ఈ నెల 12న మృతి చెందింది. భార్య ప్రాణాలు కాపాడేందుకు శంకరయ్య అప్పు చేసి వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. ఆ రోజు నుంచి దిగాలుగా ఉన్న ఆయన.. ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన శంకరయ్య సోదరుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతునికి ధనశ్రీ అనే ఆరేళ్ల కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ గడువు పొడిగింపు



అనంతపురం అగ్రికల్చర్: ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ ప్రక్రియను ఈనెల 23 వరకు పొడిగిస్తూ వ్యవసాయ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ–కేవైసీ చాలా ప్రాంతాల్లో పెండింగ్ ఉన్నందున మరో ఎనిమిది రోజులు పొడిగించినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఆర్‌ఎస్‌కేల్లో జాబితాలు ప్రదర్శించి గ్రామసభల ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తారు. 28, 29 తేదీల్లో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. ఈనెల 30న తుది జాబితాలు ఆర్‌ఎస్‌కేల్లో ప్రదర్శిస్తారు. అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి రైతూ ఈ–క్రాప్ చేయించుకున్న అనంతరం తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలి.

గుడ్డూ.. బ్రెడ్డూ..



దులీప్ ట్రోఫీ మ్యాచులు ఆడటానికి వచ్చిన క్రికెటర్లకు అందించే ఆహార పదార్థాలు..

- అల్పాహారంలో ప్రొటీన్ ఫుడ్డుకే క్రికెటర్ల ఓటు
- మెనూలో కనిపించని మటన్ బిరియానీ
- ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్డు, బ్రెడ్ ఆమ్లెట్, మొలకెత్తిన గింజలు
- మధ్యాహ్నం, రాత్రిపూట రెండు, మూడు రకాల చికెన్ వంటకాలు
- సౌతిండియన్ వంటకాలపై ఆసక్తి



ఆర్డీటీ క్రీడాగ్రామంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఓ దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉదయం ఆరు గంటలకే లేచి రెండు గంటల పాటు జిమ్ చేయాలి. ఆట లేని రోజు ప్రాక్టీస్ ఉంటుంది. మ్యాచ్ ఉంటే రోజులో కనీసం ఎనిమిది గంటల పాటు గ్రౌండ్‌లోనే గడపాలి. ఇదీ దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచులు ఆడటానికి అనంతపురానికి వచ్చిన క్రికెటర్ల షెడ్యూలు. మంచి ఫిట్‌నెస్‌తో ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. అందువల్లే క్రికెటర్లు నూనెల్లో మునిగితేలిన ఆహారం, బాగా వేపిన కూరలు వంటివి ఏ మాత్రమూ తీసుకోవడం లేదు. ప్రస్తుతం అనంతపురంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల్లో ఆడుతున్న వారిలో చాలా మంది అంతర్జాతీయ ప్లేయర్లే. రింకూసింగ్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, మయాంక్ అగర్వాల్, సంజు శాంసన్, అర్షదీప్ సింగ్, తిలక్‌వర్మ, వాషింగ్టన్ సుందర్, రుతురాజ్ గైక్వాడ్ లాంటి పలువురు ఆటగాళ్లు ఉన్నారు. వీళ్లు తీసుకునే ఆహారం ఎలా ఉందోనని క్రికెటర్లు బస చేస్తున్న మాసినేని హోటల్‌లో ‘సాక్షి ప్రతినిధి’ పరిశీలించగా..ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.

వెరీ‘గుడ్డు’..

కోడిగుడ్డు..పోషకాహారానికి పెట్టింది పేరు. మెజారిటీ ప్లేయర్లు ఉడకపెట్టిన గుడ్డు తీసుకుంటున్నారు. అలాగే చాలామంది బ్రెడ్డు ఆమ్లెట్ ఇష్టపడుతున్నారు. గుడ్డు ఆమ్లెట్ వేసుకుని దాన్ని బ్రెడ్ మధ్యలో పెట్టి తింటున్నారు. సగం ఉడికిన అంటే హాఫ్ బాయిల్డ్ ఎగ్‌ను కూడా ఇష్టపడుతున్నారు. ఉడకబెట్టిన కూరగాయలు, శాండ్‌విచ్‌లు కూడా ఎక్కువగా తీసుకుంటున్నారు. మొలకెత్తిన పెసలు, ఉడకబెట్టిన శనగలు అల్పాహారంలో భాగంగా ఉంటున్నాయి. ఇవి ప్రతిరోజూ అల్పాహార మెనూలో ఉండాలనే నిబంధన ఉంది. మ్యాచ్ ఆడేటప్పుడు కడుపులో ఎలాంటి అలజడి ఉండకూడదు. ఇందుకు కూరగాయలే అన్నిటికంటే మంచివి. అందుకే క్యారెట్, క్యాలీఫ్లవర్, లేత కార్న్ కంకులు, ఆలూ వంటి కూరగాయలను ముక్కలుగా కోసి ఉడకబెట్టినవి ఎక్కువగా తీసుకుంటున్నారు.

ఓన్లీ చికెన్.. నో మటన్..

క్రికెటర్లకు మటన్ బిరియానీలు, కబాబ్‌లు వంటివి దూరంగా పెట్టారు. మధ్యాహ్నం, రాత్రి పూట ప్రొటీన్ కోసం చికెన్ వంటకాలు మాత్రమే చేస్తున్నారు. కొన్ని నార్త్ ఇండియన్ , కొన్ని సౌత్ ఇండియన్ చికెన్ వంటకాలు మెనూలో ఉంచారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే మటన్ బిరియానీ, చిప్స్ వంటివాటిని మెనూలో పెట్టలేదు. కూల్‌డ్రింక్స్ కూడా దగ్గరకు రానివ్వడం లేదు. పూర్తిగా చికెన్, గుడ్డు రూపంలోనే ప్రొటీన్ వంటకాలు ఇస్తున్నామని మాసినేని హోటల్ చెఫ్స్ తెలిపారు. క్రికెటర్లు ఉదయం ఆరున్నర గంటల నుంచి 8 గంటలలోపు అల్పాహారం తినేసి గ్రౌండ్‌కు వెళుతున్నట్టు బీసీసీఐ ప్రతినిధులు తెలిపారు.

ఇడ్లీ, చట్నీపై మక్కువ..



ఆంధ్రా ఇడ్లీ అంటే మక్కువ చూపించని వారు ఎవరూ ఉండరు. ప్రస్తుతం దులీప్‌ట్రోఫీ ఆడుతున్న వారిలో చాలామంది ఉత్తరాది క్రికెటర్లే. అయినా సరే మెత్తని రవ్వ ఇడ్లీని పప్పుల పొడి, వేరుశనగ చట్నీతో ఆరగిస్తున్నారు. ఎక్కువ మోతాదులో కాకుండా ఒకటి లేదా రెండు ఇడ్లీలు అల్పాహారంలో తీసుకుంటున్నారు. టమాటా బాత్, సాంబార్ మెనూలో చేర్చడంతో వీటినీ టేస్ట్ చేస్తున్నారు.

అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2న ‘స్వచ్ఛ భారత్ దివస్’ నిర్వహిస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ఇందులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ దివస్‌కు 15 రోజుల ముందు నుంచి ‘స్వచ్ఛతా హీ సేవ’ కార్యక్రమం అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ఈనెల 17 నుంచి మెగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ, మానవహారం, స్వచ్ఛతా పరుగు, సైకిల్ పరుగు, మారథాన్, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత, అమ్మ పేరుతో మొక్క నాటడం, చెత్త దిబ్బలు తొలగించడం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ వార్డుగా రూపొందించాలన్నారు. ముగ్గుల పోటీలు, చెత్త నుంచి కళాత్మక ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. పాటలు, నృత్య ప్రదర్శనలు ముఖ్యంగా జానపదాలు, బుర్రకథలు, కోలాటం వంటి స్థానిక కళలు ప్రదర్శించాలన్నారు. పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తప్పక పాల్గొనేలా చూడాలన్నారు. స్వచ్ఛతపై షార్ట్ ఫిల్మ్‌లు,రీల్స్ చేయడం, విద్యార్థులకు వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు.

‘పంట’ పోతున్నా పట్టించుకోరా..?

- ‘పొలం పిలుస్తున్నా’ పలకని వ్యవసాయశాఖ
- పెరిగిన చీడపీడల బెడద
- స్ప్రేయింగ్ ఖర్చుతో రైతుల సతమతం
- పొలంబాట పట్టని వ్యవసాయశాఖ డయోగ్నస్టిక్ టీంలు



వేరుశనగలో మందుల పిచికారీ

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ రంగంపై కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. రైతుల సంక్షేమం గాలికొదిలేసింది. ఈ క్రమంలో వ్యవసాయ శాఖలో నిర్లక్ష్యం కమ్ముకుంది. వర్షాభావ పరిస్థితుల నడుమ, అతికష్టమ్మీద ‘ఖరీఫ్’ ఏరువాక సాగించిన జిల్లా రైతుల పరిస్థితి దారుణంగా మారింది. ఆశ నిరాశల మధ్య అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నా వ్యవసాయశాఖ చోద్యం చూస్తోంది.

72 శాతం విస్తీర్ణంలో ఖరీఫ్..

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 3,46,783 హెక్టార్లు అంచనా వేయగా, 2,48,945 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేశారు. అందులో వేరుశనగ సగానికి తగ్గి 96,592 హెక్టార్లకు పరిమితమైంది. కంది మాత్రం 68,610 హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి వచ్చింది. ఆ తర్వాత పత్తి 28,603 హెక్టార్లు, ఆముదం 18,544, మొక్కజొన్న 13,267, కొర్ర 5,110, సజ్జ 2,624, వరి 13,335 హెక్టార్ల మేర సాగులో ఉన్నాయి. జూన్ 15 నుంచి ఆగస్టు 15 వరకు వరుణుడు మొహం చాటేయడంతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అయితే ఆగస్టు 15 నుంచి 22 వరకు, అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు కొంత వరకు కోలుకున్నాయి.

పట్టనట్లు వ్యవసాయ శాఖ..

ప్రస్తుతం పంటలు పూత, పిందె, కంకి, కాయ దశల్లో ఉన్నాయి.ఈ క్రమంలో ఆకుముడత (లీఫ్ మైనర్), కాండంకుళ్లు తెగుళ్లు, గులాబీరంగు కాయతొలచు పురుగు (పింక్‌బౌల్ వార్మ్), వెర్రి తెగులు, అగ్గితెగులు, నామాల పురుగు, తుప్పు తెగులు, కాండంతొలచు పురుగు లాంటివి పంటలకు ఆశించి దెబ్బతీస్తున్నాయి. దీంతో రైతులు పురుగు మందుల దుకాణాలకు క్యూ కడుతున్నారు. దుకాణదారులు సూచించే వివిధ రకాల మందుల పిచికారీకి పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అక్కడక్కడా కొందరు మినహా చాలా మంది పొలంబాట పట్టడం లేదు. శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయశాఖ డయోగ్నస్టిక్ బృందాలు ఎక్కడా పర్యటించడం లేదు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో రైతులకు తగిన సలహాలు ఇవ్వడంలో విఫలమవుతున్నారు. ఇదిగో అదిగో అంటూ ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని తరచూ వాయిదా వేస్తుండటంతో అంతలోపు పుణ్యకాలం కాస్తా పూర్తవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో 14 మందికి గాయాలు



రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాయదుర్గం టౌన్: విందుకు వెళ్లిన ఒకే కాలనీకి చెందిన 14 మంది తేనెటీగల దాడిలో గాయపడి ఆస్పత్రిపాలయ్యారు. ఈ ఘటన రాయదుర్గం పట్టణ శివారు ప్రాంతమైన గొందిచెరువు ఏరియాలో ఆదివారం సాయంత్రం జరిగింది. బాధితుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గం ఏడో వార్డు సత్యనారాయణస్వామి గుడి ఏరియాలో ఇటీవల వినాయక చవితి వేడుకలు విజయవంతంగా ముగించారు. ఈ సంతోషంలో నిర్వాహకులు 15 మందికి పైగా కలిసి ఆదివారం గొందిచెరువు ఏరియాలో విందు ఏర్పాటు చేసుకున్నారు. భోజనం ముగించుకుని సాయంత్రం నాలుగు గంటలకు ఇళ్లకు వచ్చేందుకు సిద్ధమవుతుండగా.. వారు కూర్చొన్న ప్రాంతంలోని చెట్టు నుంచి తేనెటీగలు ఒక్కసారిగా లేచి దాడి చేశాయి. 13 ఏళ్లలోపు చిన్నారులు గణేష్, చరణ్, రోహిత్, జ్ఞానేష్‌తో పాటు మల్లికార్జున, రమేష్, నాగేష్, శంకర్, అప్పన్న, సురేష్, రాజశేఖర్, మంజునాథ, పి.మంజునాథ, పవన్ గాయపడ్డారు. వీరిలో శంకర్, అప్పన్న, సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరంతా రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వ్యక్తిపై టీడీపీ నాయకుల దాడి



గోపాల్‌రెడ్డితో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం: స్థానిక రామ్‌నగర్‌లోని సిరి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గోపాల్ రెడ్డి అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి టీడీపీ నేతలు దాడి చేశారు. అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌ను మార్చాలని కొందరు ప్రతిపాదన చేయగా.. ఆరు ఫ్లాట్లకు యజమానిగా ఉన్న గోపాల్ రెడ్డి వాచ్‌మెన్‌ను మార్పు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అపార్ట్‌మెంట్‌వాసులతో సమావేశమై విషయం వెల్లడించారు. ఈ క్రమంలోనే టీడీపీ నాయకుడు ఆదినారాయణ తదితరులు ఉన్నపళంగా గోపాల్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. అపార్ట్‌మెంట్‌లో తాము చెప్పిందే జరగాలంటూ దౌర్జన్యం చేశారు. గోపాల్ రెడ్డిపై దాడి చేశారు. నిష్కారణంగా తనపై దాడి చేశారని బాధితుడు వాపోయాడు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, టీడీపీ వర్గీయుల దాడితో అపార్ట్‌మెంట్‌వాసుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

రెండు నెలల్లో బ్రిడ్జి పనులు ప్రారంభం

- ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా



బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నయీముల్లా

కణేకల్లు: మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరే ప్రక్రియకు రెండు నెలల్లో అంకురార్పణ పడనుంది. కణేకల్లు శివారులో వేదవతి హగరిపై బ్రిడ్జి నిర్మించాలంటూ దశాబ్దాలుగా ప్రజల నుంచి వస్తున్న విన్నపాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. రూ.40 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. అయితే, అగ్రిమెంటుతోపాటు సాంకేతికపరంగా నెలకొన్న సమస్యల కారణంగా పనుల ప్రారంభంలో కొంత జాప్యమైంది. ఈ క్రమంలో బ్రిడ్జి నిర్మించే ప్రదేశాన్ని ఆదివారం అనంతపురం ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఈఈ రాజగోపాల్‌తో కలిసి ఈఎన్‌సీ నయీముల్లా పరిశీలించారు. వరద ఉధృతి ఏ మేరకు ఉంటుంది? ఎంత ఎత్తులో నీరు ప్రవహిస్తాయనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రత్యామ్నాయ దారి లేనందున ఇన్నాళ్లూ హెచ్చెల్సీ అక్విడెక్ట్‌పై వాహనాలు తిరిగేవని, అక్విడెక్ట్ ప్రమాదకర స్థితిలో ఉండటంతో అధికారులు వాహనాల రాకపోకలపై అభ్యంతరం తెలుపుతున్నారని డీఈఈ రవిశంకర్ వివరించారు. అనంతరం ఈఎన్‌సీ స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసి టెండర్లను పూర్తి చేసిందన్నారు. అగ్రిమెంటు చేయాల్సి ఉందన్నారు. నిబంధనల మేరకు కొత్తరేట్లతో రివైజ్ ఎస్టిమేషన్ ప్రకారం రూ.48 కోట్లు మంజూరు చేయాల్సి ఉందని, రెండు కమిటీల అంగీకారంతో త్వరలో నిధులు మంజూరు కానున్నాయన్నారు. ఈ పనులన్నీ 15, 20 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కాంట్రాక్టర్ సైతం పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారని, రెండు నెలల్లో బ్రిడ్జి పనులను ప్రారంభిస్తామన్నారు. రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. 12 మీటర్ల వెడల్పు, 480 మీటర్ల పొడవుతో అత్యంత నాణ్యతతో బ్రిడ్జి నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ ఎండీ రాంసుబ్బారెడ్డి, జేఈలు ఎల్.సుజిత, నాగేంద్ర, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన..

కూడేరు: మండల పరిధిలోని జయపురం సమీపాన బ్రిడ్జి నిర్మాణం కోసం స్థలాన్ని ఆదివారం ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నయీముల్లా పరిశీలించారు. జయపురం నుంచి రామసాగరం, తగ్గుపర్తి, బెళుగుప్ప, గుండ్లపల్లి మీదుగా రాయదుర్గం వెళ్లవచ్చు. అయితే, పెన్నానది, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు పీఏబీఆర్‌లోకి వెళ్లే సమయంలో రోడ్డుపై నుంచి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలో బ్రిడ్జి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబులు పతి, ఐఈఈ ప్రసాద్ రెడ్డి, డీఈఈ బాల కాటమమ్మ, జేఈఈ కావ్య తదితరులు ఉన్నారు.



బరువైనా ‘సాగా’ల్సిందే

అనంతపురం రూరల్ మండలం లింగంపల్లికి చెందిన రైతు మచ్చ ఆదిశేషారెడ్డి తన పొలంలో బెండకాయ పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొలంలో కలుపు విపరీతంగా పెరిగింది. దీంతో పంట దిగుబడి బాగా లేదు. కలుపు తీసేందుకు కాడెద్దులు పెట్టాలంటే కూలి ఎక్కువ అడుగుతున్నారు. ఆ మేరకు పెట్టుబడి పెడితే పంట నుంచి వచ్చే కాస్తో కూస్తో ఆదాయం కూడా వెళ్లిపోతుంది. ఈ క్రమంలో ఇదిగో ఇలా తానే కాడెద్దుగా మారి పొలంలో కలుపు తొలగించే పనులు చేపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా

'సమగ్ర' ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

- జేఏసీ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. చిరుద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. జేఏసీ నాయకుడు ఓబుళరెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ రాయలసీమ ప్రాంతీయ సదస్సు జరిగింది. సదస్సుకు ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. అగ్రిమెంట్ బాండ్ విధానం రద్దుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చిరుద్యోగులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఈ దుస్థితి నెలకొందని మండిపడ్డారు. ఇప్పటి వరకూ తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, సీఐటీయూ అధ్యక్షురాలు నాగమణి, జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.నాగరాజు, సురేష్‌వర్మ, నాగరాజు, మాధవ్, శంకరయ్య, నరసింహమూర్తి, నూర్ మహమ్మద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అసమానతలు తొలగితేనే సమగ్రాభివృద్ధి

అనంతపురం: ప్రాంతీయ అసమానతలు తొలగితేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన జేవీవీ రెండో రోజు వార్షిక మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి - కొన్ని పరిశీలనలు ' అంశంపై మాట్లాడారు. ప్రభుత్వాల దృష్టిలో అభివృద్ధి అంటే జీడీపీ, తలసరి ఆదాయం వంటి ఆర్థికపరమైన అంశాలే ఉన్నాయని, అయితే నిజంగా అభివృద్ధి అంటే అది కాదని పేర్కొన్నారు. అందరికీ వైద్యం, విద్య, ఉపాధి లభించినపుడే నిజమైన అభివృద్ధి అవుతుందన్నారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం అని మాత్రమే సీఎం చంద్రబాబు చెబుతున్నారని మండిపడ్డారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను విస్మరించి మాట్లాడడం సరికాదన్నారు. సదస్సుకు జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయం వద్దు

మెడికల్ కళాశాలల విషయంలో మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయి. నీచ రాజకీయాలు పక్కన పెట్టి విద్యార్థుల ఉజ్వల భవితకు చర్యలు తీసుకోవాలి. కళాశాలల నిర్మాణం జరగలేదని, క్లాస్‌రూంలు లేవని, చదువు చెప్పే ప్రొఫెసర్లు లేరని సాకులు చెబుతూ రాష్ట్రానికి వచ్చిన అవకాశాలను చెడగొట్టే కుట్ర చేయడం బాధాకరం. ఇప్పటికే వైద్య విద్య అనేది పేద విద్యార్థులకు అందడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడరాదు.

– రంగయ్య, సీపీఐ కార్యదర్శి, తాడిపత్రి నియోజకవర్గం



దుష్ప్రచారం తగదు

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌దే. కొత్త కళాశాలల ఏర్పాటుతో 2,185 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా వచ్చేలా చేశారు. వైద్య విద్యలో పీజీ సీట్లనూ పెంచారు. ఇంత పెద్ద ఎత్తున సంస్కరణలకు శ్రీకారం చుడితే ఈ రోజు నీచమైన రాజకీయాలు చేస్తూ రాష్ట్రంలో ఒక్క మెడికల్ కళాశాల నిర్మాణం కూడా కాలేదని మంత్రి సత్యకుమార్ దుష్ప్రచారానికి తెరలేపడం సిగ్గు చేటు.

– షేక్ బాబా సలాం, వైఎస్సార్ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు, అనంతపురం



దుర్గం ప్రజల దాహార్తి తీరేనా?

- మరుగున పడిన ఇంటింటికీ శుద్ధనీటి కుళాయి పథకం
- రూ.157.55 కోట్లతో వాటర్ గ్రిడ్‌కు శ్రీకారం చుట్టిన జగన్ సర్కార్
- 74 పనులు ప్రారంభం... 18 పనుల పూర్తి
- మిగిలిన పనులను పట్టించుకోని కూటమి సర్కార్
- అర్ధంతరంగా ఆగిన పనులు

కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలకు తాగునీరు ఎండమావిలా మారింది. మున్సిపాలిటీ పరిధితో పాటు పలు గ్రామాల్లో నేటికీ మంచినీటి కుళాయిలు లేక ట్యాంకర్లతో అరకొరగా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి చేయించడంలో కూటమి సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో ఈ పథకానికి అప్పట్లో జగన్ సర్కార్ కేటాయించిన రూ.157.55 కోట్ల నిధులు మురిగిపోయే ప్రమాదం నెలకొంది.

కళ్యాణదుర్గం: దశాబ్దాలుగా కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతూ ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి శుద్ధి (ప్యూరిఫైడ్) నీటిని అందించేలా బృహత్ పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.157.55 కోట్ల వ్యయంతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందులో మున్సిపాలిటీ పరిధిలో రూ.138.02 కోట్లు, రూరల్ పరిధిలోని గ్రామాలలో రూ.19.53 కోట్లు వెచ్చించి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలను రూపొందించింది. మొత్తం వ్యయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం చెల్లిస్తే మిగిలిన 70 శాతం నిధులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ చెల్లించేందుకు ముందుకు వచ్చింది. 2020లో పథకానికి రూపకల్పన జరగగా... పనులను మెగా, డీపీఆర్ కంపెనీలు దక్కించుకున్నాయి. ఈ క్రమంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీతో పాటు దొడగట్ట, గూబనపల్లి, ఒంటిమిద్ది, దేవాదుల కొండ, ముదిగల్లు గ్రామాలలో ఇంటింటికీ శుద్ధనీటి కుళాయిల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. అర్బన్ పరిధిలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్ఎస్ఆర్)ల నిర్మాణాలు చేపట్టాయి.



మారెంపల్లి కాలనీ వద్ద అర్ధంతరంగా ఆగిన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం

ప్రభుత్వం మారగానే...

అర్బన్ ప్రాజెక్టుకు పీఏబీఆర్ నుంచి కళ్యాణదుర్గం అక్కమాంబ కొండ వరకూ 39.5 కిలోమీటర్ల మేర పైపులైన్, అక్కమాంబ కొండపై నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రచించారు. అంకంపల్లి వద్ద సంపు నిర్మించి, అక్కడి నుంచి కళ్యాణదుర్గం సంప్‌నకు ఎత్తిపోతల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు అప్పట్లో కసరత్తు చేశారు. మొత్తం 46 గ్రామాలలో 74 పనులకు గాను 18 పనులు పూర్తయ్యాయి. మొత్తం 74 పనులకు సంబంధించి రెండు విడతల్లో రూ.5.66 కోట్లు ప్రతిపాదనలు చేయగా ఇప్పటివరకు పూర్తయిన 18 పనులకు రూ.68 లక్షల నిధులు వినియోగించారు. మిగిలిన పనులు పూర్తి చేసేలోపు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి వరకూ శరవేగంగా సాగుతున్న నాలుగు ఓహెచ్ఎస్ఆర్ పనులకు సంబంధించి బకాయి నిధులు చెల్లించడంలో కూటమి సర్కార్ ఉదాసీనంగా వ్యవహరించడంతో పనులను సదరు కాంట్రాక్ట్ కంపెనీలు అర్ధంతరంగా నిలిపి వేశాయి. దీంతో ఇంటింటికీ మంచి నీటి కుళాయి పథకం మరుగున పడింది.

వాటర్ గ్రిడ్ పనుల ఊసెత్తని కూటమి ప్రభుత్వం

కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చే ప్రతిష్టాత్మక వాటర్ గ్రిడ్ పథకంపై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదు. దీంతో మున్సిపాలిటీ పరిధితో పాటు రూరల్ పరిధిలో ప్రజలు డబ్బు వెచ్చించి మంచినీటిని కొనుగోలు చేస్తున్నారు. వాటర్ గ్రిడ్ ఏర్పాటై ఉంటే రోజుకు 70 వేల జనాభా కోటి లీటర్ల నీటిని ఉచితంగా అందుకునేవారు.

నీటి సమస్య రాకుండా చూడాలి

కొన్నేళ్లుగా మా గ్రామ ప్రజలు తాగునీటి కోసం నానా ఇక్కట్లు పడుతున్నారు. ఈ సమస్యకు జగన్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించడంతో చాలా సంతోషపడ్డాం. అయితే ప్రభుత్వం మారిన తర్వాత తాగునీటి పథకం పనులు ఆగిపోయాయి. 15 లీటర్ల వాటర్ క్యాన్‌ను రూ.15తో కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేయాలి.

– రామకృష్ణ, ఒంటిమిద్ది గ్రామం, కళ్యాణదుర్గం

బిల్లులు కాలేదని ఆపేశారు

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఏఐఐబీ కింద రూ.138.02 కోట్ల వ్యయంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులను మెగా, డీపీఆర్ కంపెనీలు దక్కించుకున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో ఓవర్ హెడ్ ట్యాంకుల పనులు బేస్‌మెంట్ వరకూ జరిగాయి. ఆ తర్వాత సాంకేతిక కారణాలతో బిల్లులు మంజూరు కాలేదని ఆ పనులను సదరు కంపెనీలు ఆపేశాయి.

– సతీష్‌చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ విభాగం, అనంతపురం

గేదెల దొంగల పట్టివేత

తాడిపత్రి రూరల్: మండలంలోని తేరన్నపల్లి క్రాస్ వద్ద గేదెలను అపహరించుకెళుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన పరమేష్, మనోహర్‌కు చెందిన మూడు గేదెలు అపహరణకు గురయ్యాయి. దీనిపై బాధిత పాడి రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఓ గేదెను తోలుకెళుతున్న తాడిపత్రి మండలం వంగనూరుకు చెందిన బొగ్గుల బాబు, గోగుల మారుతి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయం వెలుగు చూసింది. తాము అపహరించిన గేదెల్లో రెండింటిని కర్నూలు జిల్లా డోన్‌లో జరిగిన సంతలో రూ.లక్షకు విక్రయించినట్లు వారు అంగీకరించారు. మరో గేదెను అనంతపురంలో జరిగే సంతలో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లుగా వివరించారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచబోతున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

అనంతపురం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న బంగి విజయ్‌కుమార్ (23) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తాను ప్రేమించిన మేనమామ కుమార్తెతో పెళ్లికి అమ్మాయి తరపు పెద్దలు నిరాకరించారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న విజయ్‌కుమార్ ఈ నెల 13న గుత్తి రోడ్డులోని ఓ హోటల్ వెనుక పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడిని స్థానికులు గుర్తించి వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఈ నెల 14న మృతి చెందాడు. ఘటనపై అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడి తండ్రి మరాటి సురేష్... కక్కలపల్లి నివాసి. ప్రస్తుతం ఆయన బెంగళూరులో ఉంటున్నారు.

'అపుస్మా' జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



సుబ్బారెడ్డి



రవిశంకర్ ప్రసాద్



శ్రీనాథ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నికైంది. ఆదివారం రాప్తాడు మండలంలోని మరూరు టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న మాంటిసోరి ఎలైట్ స్కూల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ప్రక్రియను సభ్యులు పూర్తి చేశారు. జిల్లా అధ్యక్షుడిగా కె.సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎస్.రవిశంకర్‌ప్రసాద్, ట్రెజరర్‌గా బీవీ శ్రీనాథ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నిక పరిశీలకులుగా శ్రీనివాస రెడ్డి, వాసుదేవయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ... జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కరస్పాండెంట్లు ఏ సమయంలో ఫోన్ చేసినా అందుబాటులో ఉంటామని భరోసానిచ్చారు.

• పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యాడికి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదో తరగతి చదువుకున్న వారందరూ ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, అనంతపురం తదితర ప్రాంతాల్లో వివిధ హోదాల్లో స్థిరపడిన వారందరూ దాదాపు 36 సంవత్సరాల తర్వాత కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువుల సేవలను కొనియాడారు. నాటి ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, అశ్వత్థరెడ్డి, నారాయణస్వామి, బాషా, జనార్దనరావు, లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అజయ్ రామ్, ప్రసాద్, వర్మ, రాజశేఖర్, శివప్రసాద్, కృష్ణమోహన్, రవిశంకర్, లూక, నారాయణరెడ్డి, గంగశేఖర్, సుజాత, ప్రసన్న, జయలక్ష్మి, శ్రీదేవి తదితరులు నేతృత్వం వహించారు.

ఇండియా-ఏ ఘన విజయం

- రికీ భుయి సెంచరీ వృథా
- ఇండియా–డీకి వరుసగా రెండో ఓటమి



సెంచరీ చేసి అభివాదం చేస్తున్న రికీ భుయి





స్టేడియంలో అభిమానుల సందడి

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడా గ్రామం ప్రధాన మైదానంలో జరిగిన నాలుగు రోజుల మ్యాచులో ఇండియా-ఏ జట్టు ఘన విజయం సాధించింది. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని ఇండియా–డీ జట్టు వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది. తెలుగు తేజం రికీ భుయి అద్భుత సెంచరీ (195 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 113 పరుగులు) సాధించినప్పటికీ ఇండియా–డీని ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. 488 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోరు 62/1తో చివరిరోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా–డీ జట్టు 301 పరుగులకు ఆలౌట్ అయ్యి.. 186 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. సెంచరీ హీరో రికీ భుయ్‌కి జట్టులోని ఏ ఒక్క ఆటగాడి నుంచి మంచి సహకారం లభించలేదు. సంజూ శాంసన్ (40), శ్రేయస్ అయ్యర్ (41), యశ్ దూబే (37)లకు మంచి ఆరంభాలు లభించినా.. భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇండియా–ఏ ఆల్‌రౌండర్ సామ్స్ ములానీ (89 పరుగులు, 4 వికెట్లు)కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా.. రికీ భుయికి ఇది 19వ ఫస్ట్‌క్లాస్ సెంచరీ. అత్యధిక సెంచరీలు సాధించిన తొలి ఆంధ్రా క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.



సామ్స్ ములానీ



అన్షుల్ కాంభోజ్

ఇండియా–సీ, బీ మ్యాచ్ డ్రా

అనంత క్రీడా గ్రామం రెండో మైదానంలో ఇండియా–బీ, ఇండియా–సీ జట్ల మధ్య జరిగిన దులీఫ్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 309/7తో చివరిరోజు ఆట కొనసాగించిన ఇండియా–బీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 108 ఓవర్లలో 332 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఇండియా–సీకి 193 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇండియా–బీ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ 286 బంతుల్లో 157 (14 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశాడు. అనంతరం ఇండియా –సీ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 128/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 62 , రజిత్ పటీదార్ 42 పరుగులు చేశారు. ఇండియా–బీ బౌలర్లలో రాహుల్ చహార్ 2, ముకేష్ కుమార్, ముషీర్‌ఖాన్ చెరో వికెట్ తీశారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారంతో మ్యాచును డ్రాగా ముగించారు. 27.5 ఓవర్లలో 69 పరుగులు ఇచ్చి 8 వికెట్లు తీసిన ఇండియా–సీ బౌలర్ అన్షుల్ కాంభోజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన అతను దులీప్ ట్రోఫీలో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసిన ఐదో బౌలర్‌గా నిలిచాడు. అదే విధంగా మూడో పేసర్ కావడం గమనార్హం. హర్యానాకు చెందిన కాంభోజ్ ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన వారికి అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అవార్డులను అందజేశారు.

సంక్షిప్త స్కోర్లు..

ఇండియా–ఏ: తొలి ఇన్నింగ్స్ 290, రెండో ఇన్నింగ్స్ 380/3 (డిక్లేర్డ్)
ఇండియా–డీ: తొలి ఇన్నింగ్స్ 183, రెండో ఇన్నింగ్స్ 301

ఇండియా–సీ: తొలి ఇన్నింగ్స్ 525, రెండో ఇన్నింగ్స్ 128/4 (డిక్లేర్డ్)
ఇండియా–బీ: తొలి ఇన్నింగ్స్ 332

రాష్ట్ర ఖోఖో జట్టులో జిల్లా వాసులకు చోటు


జె.పంగులూరు: ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరు కాగా, రాష్ట్ర జట్టులో అనంతపురానికి చెందిన పి.జ్యోతిరామ్, ఎ.స్వప్నకు చోటు దక్కింది.

'ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఏకపక్ష నిర్ణయాలు'

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని జిల్లా శాఖ ఖండించింది. ఈ మేరకు జిల్లా కమిటీ పేరుతో ఆదివారం ఓ ప్రకటన విడుదలైంది. ఇటీవల ఖాళీ అయిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పదవికి బి.హనుమప్ప పేరును జిల్లా శాఖ ప్రతిపాదిస్తూ రాష్ట్ర కమిటీకి సిఫారసు చేసింది. ఈ సిఫార్సును రాష్ట్ర కమిటీ పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి ఉద్యమాల్లో పాల్గొనని, జిల్లా సబ్ కమిటీని వ్యతిరేకించిన వ్యక్తిని ఎంపిక చేసింది. దీంతో జిల్లాతో సంబంధం లేకుండా, జిల్లా అభిప్రాయాన్ని గౌరవించకుండా ఏకపక్షంగా రాష్ట్ర కమిటీకి జిల్లాకు చెందిన వ్యక్తిని ఎన్నిక చేయడం జిల్లా శాఖను అవమానించడమేనని సభ్యులు వాపోయారు.

మానవాళికి మార్గదర్శకంగా...

- ఆదర్శప్రాయం.. మహమ్మద్ ప్రవక్త జీవితం



మదీనా నగరంలోని ప్రవక్త సమాధి ఉన్న మసీదు

రాయదుర్గం టౌన్: 'సమాజంలో నెలకొన్న చీకట్లను చీల్చే సూర్యుడిలా వందల ఏళ్ల క్రితమే అభ్యుదయ భావాలతో ఉదయించి సమస్త మానవాళికి మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు అల్లా ప్రవక్త (దేవదూత) మహమ్మద్(స) మార్గం అందరికీ అనుసరణీయంగా మారింది. ఇస్లాంను విశ్వవ్యాప్తం చేసిన వారిలో చివరి ప్రవక్తగా ఖ్యాతిగాంచిన మహమ్మద్(స) పుట్టిన రోజును మిలాద్–ఉన్–నబీగా ముస్లింలు ఆచరిస్తున్నారు.

ఆధ్యాత్మికత.. తాత్విక చింతన..

శాంతి, ధర్మం, సమానత్వం, తోటి వారి పట్ల ఎలా మెలగాలో బోధించిన మహమ్మద్ ప్రవక్త.. పరిపూర్ణ ఆధ్యాత్మికతకు, తాత్విక చింతనకు మారుపేరుగా నిలిచారు. అల్లా సందేశాలను తొలుత ఆయన ఆచరించిన తర్వాతనే ఇతరులకు ప్రబోధించేవారు. వందల ఏళ్ల క్రితం ఆ రోజుల్లో అరేబియా, ఇతర దేశాల్లో మహిళల స్థితిగతులు దారుణంగా ఉండేవి. అలాంటి తరుణంలో వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకోవచ్చునని, ఇరుగు పొరుగు, తల్లిదండ్రులు, కట్టుకున్న భార్యతో ఎలా మెలగాలి అనే అంశాలపై ప్రజలను మహమ్మద్ చైతన్యపరుస్తూ వచ్చారు. తన 40వ ఏటా ప్రవక్తగా అవతరించారు. అల్లాహ్ దూత జిబ్రయిల్ అలే సలాం నుంచి సందేశం అందుకున్న ఆయన సగటు మనిషి సన్మార్గంలో ఎలా జీవించాలి, అల్లాహ్ అనుగ్రహం ఎలా పొందాలో స్పష్టం చేశారు. 63 ఏళ్ల పాటు అల్లా చూపిన మార్గంలో నడుస్తూ ఆదర్శవంతమైన జీవితం గడిపిన మహమ్మద్ ప్రవక్త... రబ్బీ–ఉల్–అవ్వాల్ (ఇస్లామిక్ క్యాలెండర్‌లోని మూడో నెల) స్వర్గస్తులయ్యారు.

ప్రత్యేక ప్రార్థనలు, జులూస్ కార్యక్రమాలు..

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని (మిలాదున్ నబీ) పురస్కరించుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాల్లోని అన్ని మసీదుల్లో ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రవక్త జీవిత చరిత్రపై మౌలానాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. సోమవారం ఉదయం జులూస్ పేరుతో మక్కా, మదీన నమూనాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు.

ప్రవక్త జీవితం ఆచరణీయం



మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించిన మహనీయుడిగా మహమ్మద్ ప్రవక్తకు పేరుంది. ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే మనిషి జీవితానికి సార్థకత ఉంటుంది. ఆయన జీవితాన్ని అనుసరిస్తే అల్లాహ్ కరుణ సాధ్యపడుతుంది. తల్లిదండ్రులను గౌరవించడం, ఇస్లామిక్ ధర్మ సూత్రాలు ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్రలు తప్పనిసరిగా పాటించాలి.

– మహమ్మద్ సైఫుల్లా, ప్రభుత్వ ఖాజీ, రాయదుర్గం

మంత్రి వ్యాఖ్యలు విడ్డూరం



వైఎస్ జగన్ హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా మెడికల్ కళాశాలను తీసుకొని వచ్చి వాటి నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం వాటికి మంజూరైన సీట్లను కూడా కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని చూడటం దుర్మార్గం. పులివెందుల వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లను వదులుకోకూడదు.

– సురేష్, బద్దలాపురం, కనగానపల్లి మండలం



మెడికల్ సీట్లు వదులుకోవడం హేయం



రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా 17 మెడికల్ కళాశాలలు స్థాపించేందుకు గత సీఎం వైఎస్ జగన్ ఏర్పాట్లు చేశారు. వీటిలో 750 మెడికల్ సీట్లు తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. మళ్లీ వైఎస్ జగన్ సీఎంగా గెలిచి ఉంటే ఈ విద్యా సంవత్సరంలో పాడేరు, మర్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలు కూడా ప్రారంభమయ్యేవి. మరో 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండేది. అలాంటి గొప్ప వ్యక్తి గురించి మాట్లాడే అర్హత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

– తలారి నవీన్, యలకుంట్ల, కనగానపల్లి మండలం

క్లుప్తంగా

పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామిని బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుపూజ అనంతరం స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

30 కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం అర్బన్: నేతన్న నేస్తం పథకం తిరిగి ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది మగ్గం నేసే కార్మికులు, 70 వేల మంది ఉప కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులపై సవతి ప్రేమ చూపిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.

సుధాకర్ బాబుకు జాతీయ నంది పురస్కారం



ప్రొఫెసర్ సుధాకర్ బాబును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే.సుధాకర్ బాబుకు తెలుగు, వెలుగు జాతీయ నంది పురస్కారం ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈ అవార్డు అందజేస్తున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కే.సుధాకర్ బాబు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

కమిటీ మెంబర్లకు విరాళం



మసీద్ కమిటీ మెంబర్లకు విరాళం అందజేస్తున్న సాదిక్ వలి

అనంతపురం రూరల్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లోని మజిద్ ఏ రహమద్ కమిటీ మెంబర్లకు ఆదివారం ఎంఎస్ఎస్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, రుద్రంపేట ఎంపీటీసీ–4 సభ్యురాలు మహబూబీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్‌వలి రూ.12 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో విరాళం అందించామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ముతవల్లీలు రంజాన్ వలి, షరీఫ్, మున్నా, షెక్షా, మహబుబ్ బాషా, ఖాజా, సాదిక్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ర్యాలీ ప్రశాంతంగా జరగాలి



మాట్లాడుతున్న అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్

అనంతపురం: మిలాద్ ఉన్ నబీ పర్వదిన ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని మతాల వారు సహకరించాలని అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్ అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని చేపట్టే ర్యాలీల సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. సమావేశంలో ముస్లిం మత పెద్దలు, నగర సీఐ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సచివాలయాలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధులు పంపనూరు తండా గ్రామానికి చెందిన నేమే నాయక్, సోమ్లా నాయక్, బాలా నాయక్. ఈ ముగ్గురికీ భార్యలు చనిపోయారు. ఆర్డీటీ సంస్థ వీరికి ఆర్థికసాయం అందజేయనుంది. ఇందు కోసం ఫ్యామిలీ సర్టిఫికెట్ అవసరమైంది. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం గత పది రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పంపనూరు సచివాలయంలో సంబంధిత అధికారి సెలవు పెట్టడంతో.. అత్యవసరమై ఆత్మకూరు సచివాలయానికి వచ్చారు. కానీ అక్కడ ప్రింటర్ పని చేయడం లేదని సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిస్సహాయంగా వెనుదిరిగారు.

- పని చెయ్యని ప్రింటర్లు, ఇన్వర్టర్లు (యూపీఎస్‌లు)
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం
- పనులు జరగక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు





ఆత్మకూరు సచివాలయం, (ఇన్‌సెట్‌లో) సచివాలయంలో మూలన పడేసిన యూపీఎస్

ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. సమస్యల పరిష్కారానికి మండల కేంద్రాలకు వెళ్లకుండా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పంచాయతీల్లోనే గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి 11 మంది సిబ్బంది నియమించారు. సచివాలయ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు పక్కా భవనాలు నిర్మించారు. అందులో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతరత్రా సామగ్రి సమకూర్చారు. అయితే ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ నీరుగారుతోందని చెప్పవచ్చు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదు. సచివాలయాల్లో సరైన సదుపాయాలు, సౌకర్యాలు లేక సచివాలయ ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఖరికి కొన్ని సచివాలయాల్లో తాగడానికి నీరు కూడా పెట్టడం లేదు. తలుపూరు సచివాలయం కోర్టులో ఉండటంతో పాత పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సేవలు అందిస్తున్నారు. తలుపూరు సచివాలయ ఉద్యోగస్తులకు మరుగుదొడ్ల సదుపాయం కూడా లేకపోవడంతో బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఏం చేయాలోతెలియక సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రింటర్లకు మరమ్మతులు చేయించరా?

మండలంలో 11 సచివాలయాల్లో దాదాపు ఆరు సచివాలయాల్లో సగానికి పైగా ప్రింటర్లు, యూపీఎస్‌లు (ఇన్వర్టర్లు) పని చెయ్యడం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ప్రింటర్లు పని చెయ్యక పోవడంతో నిరాశతో తిరిగి వెళ్లిపోతున్నారు. అంతేకాకుండా ఆత్మకూరు సచివాలయం–1లో ఓ గదిలో విద్యుత్ సమస్య ఉండటంతో కంప్యూటర్‌ను బయట హాల్‌లో పెట్టి పని చేసే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ఒక సచివాలయంలో రెండు కంప్యూటర్లు ఉండాల్సి ఉండగా చాలా చోట్ల ఒక కంప్యూటర్ మాత్రమే పని చేస్తోంది. అత్యవసర సమయాల్లో, విద్యుత్ అంతరాయం కలిగే సమయంలో వాడాల్సిన యూపీఎస్‌లు పని చెయ్యకపోవడంతో మూలన పడేశారు. దీంతో వన్‌బీ, అడంగల్, కుల, మరణ, ఆదాయ, ఫ్యామిలీ, ఏ సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాలు ఉన్నత అధికారులకు తెలిసినా వాటికి మరమ్మతులు చేయించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంపీడీఓ లేకపోవడమే కారణమా?

ప్రస్తుతం ఆత్మకూరు మండలానికి ఎంపీడీఓగా ఎవ్వరూ రాలేదు. దీంతో జిల్లా స్థాయి అధికారులు గతంలో ఉన్న ఏఓకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమావేశాలకు మాత్రమే హాజరవుతున్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో సమస్యలు నెలకొన్నాయి. అయితే అధికారులు వీటిని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారు. మండలంలోని సచివాలయాలను తనిఖీ చేస్తే ఏ సచివాలయంలో ఏ సమస్య ఉందో తెలుస్తుందని ప్రజలు సూచిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సచివాలయాల్లో ప్రింటర్లు, యూపీఎస్‌లు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేడుకగా గంధం మహోత్సవం



ప్రార్థనలు చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మిలాద్ ఉద్ నబీ పండుగను పురస్కరించుకుని ఆదివారం పాతూరులో బోయ స్ట్రీట్‌లో షరీఫ్ సాహెబ్ కుటుంబ సభ్యులు జిలాన్ ఇంట్లో నిర్వహించిన గంధం మహోత్సవంలో మేయర్ వసీం సలీం పాల్గొన్నారు. గత 50 ఏళ్లుగా వారి ఇంటి నుంచి గంధం ఫాతిహాను నిర్వహించి తీసుకెళ్లడం ఆనవాయితీగా మారింది. ఇలాంటి వేడుకల్లో తనను భాగస్వామ్యం చేయడం గర్వకారణమని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్‌షఫీ, రబ్బానీ సాహెబ్ వారి కుమారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమా అమలు చేయాలి

అనంతపురం అర్బన్: సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 రబీ, 2025 ఖరీఫ్, రబీ సీజన్‌లకు కొత్త పంటల బీమా విధానం ప్రకటించిందన్నారు. ఇందులో ప్రైవేటు బీమా కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా వాటికి లాభం, రైతులకు నష్టదాయకంగా ఉంటుందన్నారు. ఈ విధానం రద్దు చేసి సమగ్ర పంటల బీమా విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రైతుల భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. గతంలో పంట రుణం తీసుకునే రైతులకు బీమా ప్రీమియం రుణం మొత్తం నుంచి మినహాయించుకుని రైతుల వాటా బ్యాంకులు చెల్లించే విధానం అమలులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన విధానంలో బ్యాంకులు, ప్రభుత్వం కాకుండా రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలా బాధ్యతను రైతులపై పెట్టడం సరైనది కాదన్నారు. ప్రస్తుతం ప్రకటించిన పంటల బీమా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. రైతులకు లాభదాయకమైన సమగ్ర ఉచిత పంటల బీమా విధానం అమలు చేయాలన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్ బాబు



బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ బాబును అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌బాబు నియమితులయ్యారు. ఆదివారం నగరంలోని రెండో రోడ్డులో న్యాయవాది గురుప్రసాద్ నివాసంలో వివిధ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా భాస్కర్‌బాబును ఎన్నుకున్నారు. అనంతరం భాస్కర్ బాబు మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడికి నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అనంతపురం: నగరంలోని టీవీ టవర్ సమీపంలో బైక్ అదుపుతప్పిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రాజీవ్ కాలనీకి చెందిన గౌస్ అనే వ్యక్తి నగరం వైపు వస్తుండగా.. బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన గౌస్‌ను చికిత్స నిమిత్తం సర్వజనాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పించిన ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: సాంకేతిక పురోగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. ఆదివారం జేఎన్‌టీయూ అనంతపురంలో ఇంజినీర్స్ డే సందర్భంగా సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య యావత్ భారతదేశం గర్వించదగ్గ ఇంజినీర్‌గా ఖ్యాతి గడించారని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధికంగా ఇంజినీర్లను తయారు చేస్తున్న దేశాల్లో భారతదేశం ఒకటని వెల్లడించారు. మోక్షగుండంను ఆదర్శంగా తీసుకుని ఇంజినీర్లంతా దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏ దేశమైనా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే ఇంజినీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, ఓటీఆర్ఐ వీసీ ప్రొఫెసర్ ఎన్. దేవన్న, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ బి.ఈశ్వర రెడ్డి, ప్రొఫెసర్ పి.సుజాత, ప్రొఫెసర్ జి.ప్రశాంతి, ప్రొఫెసర్ సురేష్ బాబు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, ప్రొఫెసర్ శంకర్ శేఖర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు స్ఫూర్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లకు స్ఫూర్తి ప్రదాత అని మేయర్ వసీం పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ.. మనందరికీ సాగు, తాగునీటి ప్రాజెక్టులతో దేశం నిర్మాణానికి కృషి చేసిన గొప్ప ఇంజినీర్ విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. దేశాభివృద్ధికి తోడ్పడుతున్న ప్రతి ఇంజినీర్‌కు ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్‌బాషా, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, మెహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన మహమ్మద్ మాజ్

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కూలి పని చేసే ఎల్లమ్మ ఆదివారం రాత్రి కళాజ్యోతి సర్కిల్ నుంచి గాంధీనగర్‌కు నడుచుకుంటూ వెళుతుండగా అదే రూట్‌లో వెళ్లే ఒక టూవీలర్ సితార హోటల్ వద్ద ఎల్లమ్మను వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఎల్లమ్మ ఎడమ కాలుకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మార్కెట్‌వీధికి చెందిన బంగారు షాపు నిర్వాహకుడు మహమ్మద్ మాజ్ పట్టణంలోని శ్మశాన వాటిక సమీపంలో రహదారిపై ఉన్న గుంత పూడుస్తూ ఉండగా కదిరిగేటు నుంచి ధర్మవరం టౌన్‌లోకి వస్తున్న ఒక టూవీలర్ మహమ్మద్ మాజ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహమ్మద్‌మాజ్ తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న అతని స్నేహితులు సాదిక్, జాకీర్, ఆఫన్, వసీంలు క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి భస్మాభిషేకం



అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరుడు

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయంలో స్వామికి అర్చనలు, రుద్రాభిషేకం, అ మ్మ వారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి 50కిలోల భస్మంతో బస్మాభిషేకం నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మామపై అల్లుడు దాడి

కదిరి అర్బన్: యాకాలచెర్వుపల్లిలో శనివారం రాత్రి మామపై అల్లుడు కొడవలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపిన మేరకు.. యాకాల్‌చెర్వుపల్లికి చెందిన ఆంజనేయులు తన కుమార్తెను బుక్కపట్నం మండలం బిట్టువారిపల్లి చెందిన శివకుమార్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కుమార్తె ప్రసవం కోసం పుట్టింటికి భర్తతో కలిసి వచ్చింది. మామ తన భార్యను గ్రామంలోని ఏదో వస్తువు తీసుకురావడానికి దుకాణానికి పంపాడని ఆగ్రహించి నిండు గర్భిణిని ఎలా పంపుతావని వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి ఇంట్లోని కొడవలితో మామ తలపై అల్లుడు దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు ఆంజనేయులును కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ముదిగుబ్బ: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం సీజ్ చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన మహమ్మద్ బాషా పామిడి నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కాకరకాయలు లోడ్‌తో వెళ్తున్న ఆటో రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో మహమ్మద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిరుతల సంచారంతో బెంబేలు

పామిడి: మండలంలోని అక్కజాంపల్లి సమీపంలో మూడు రోజుల క్రితం రెండు పర్యాయాలు పొలాలకు వెళ్లిన రైతులకు రెండు చిరుతలు కనిపించాయి. రైతులు కేకలు వేయండంతో రెండు చిరుతలు అక్కడ నుంచి పుల్లేటి వంకలోకి పరారయ్యాయి. అక్కడే మరుసటి రోజు అవే చిరుతలు మళ్లీ కనిపించాయి. దీంతో అక్కజాంపల్లితో పాటు రామరాజుపల్లి, ఎదురూరు గ్రామాల రైతులు పొలాలకు వెళ్లాలంటే భయాందోళనకు గురౌతున్నారు. అటవీశాఖాధికారులు తక్షణం స్పందించి చిరుతల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం లో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నబీస్వామి ఉరుసు



విద్యుద్దీపాల అలంకరణలో నబీస్వామి దర్గా

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీపరిధిలోని 17వ వార్డు బీడుపల్లిలో ఆదివారం నబీస్వామి ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసుని పురస్కరించుకుని దర్గాలను రంగురంగుల పూలు, విద్యుద్దీపాలతో అలకరించారు. సాయంత్రం దేశ్‌ముఖ్ ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రాత్రి ముస్లిం మతపెద్దలు ఖురాన్ సారాంశాన్ని వివరించారు. ఈసందర్భంగా హిందూముస్లింలు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని దర్శించుకొంటే సకల పాపాలు తొలగి మంచి జరుతుందని, కోరికలు నెరవేరుతాయని గ్రామస్తుల నమ్మకం. ఉరుసు సందర్భంగా గ్రామంలో వివిధ అంగళ్లు వెలిశాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

భార్యాభర్తలకు గాయాలు

తనకల్లు: గండోడివారిపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. వివరాలు...గద్దలబడ్డతండాకు చెందిన నరసింహులు నాయక్, తిమ్మమ్మ బైక్‌పై కొక్కంటిక్రాస్ వైపు నుంచి తండాకు బయలుదేరారు. అయితే గ్రామం దాటిన తరువాత రోడ్డుకు అడ్డంగా జింక రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ వైర్ అపహరణ

ధర్మవరం రూరల్: తుమ్మల గ్రామంలో ఆదివారం దొంగలు హల్‌చల్ చేశారు. వ్యవసాయ మోటార్లకున్న విద్యుత్ స్టార్టర్ పెట్టె, విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. వివరాలు...గ్రామానికి చెందిన రైతులు చెన్నారెడ్డి, క్రిష్టారెడ్డి, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డికి చెందిన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లారు. ఎర్రిస్వామికి చెందిన స్టార్టర్ పెట్టెను తస్కరించారు. దీనికితోడు గ్రామంలోని రక్షిత తాగునీటి పథకంకు వున్న కేబుల్ కోసుకెళ్లారు. ఇటీవల తుమ్మలు, తిప్పేపల్లి, గొట్లూరు, సుబ్బారావుపేట గ్రామాలలో వ్యవసాయ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు. పోలీసులు గస్తీ ముమ్మరం చేసి దొంగతనాలు జరుగకుండా నివారించాలని బాధితులు కోరుతున్నారు.